## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పక్కన రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): వర్షాకారంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోజారాణి మాట్లాడుతూ ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### విరివిగా మొక్కలను నాటాలి



మొక్కలు నాటుతున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్పొరేటర్ కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌తో పాటు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆల్విన్ కాలనీలో మొక్కలు నాటారు. మాజీ మార్కెట్ చైర్మన్ విజయకుమార్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్జల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మొక్కల సంరక్షణకు కృషి చేయాలి



మొక్కలను నాటుతున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపూర్ గ్రామంలో అధికారులతో కలిసి మంగళవారం మొక్కలు నాటి నీరు పోశారు. ఉపాధిహామీ ఏపీఓ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

### పార్కు స్థలాన్ని కాపాడాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాలమురళీకృష్ణ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని చక్రపురి కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలమురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొందరు ప్రైవేట్ వ్యక్తులు పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇతరులకు యథేచ్ఛగా విక్రయిస్తున్నారన్నారు. అయినా టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఇళ్ల పట్టాలను అందించాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఉన్న 729 సర్వే నంబర్ భూమిలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఇంటి పట్టాలను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నేత రాజుగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ ఏళ్ల క్రితమే 729 సర్వే నంబర్ భూమిలో పేదలు ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. కానీ.. ఇప్పటివరకూ పట్టాలను ఇవ్వలేదన్నారు. అనంతరం కాటా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈ విషయమై మంత్రి రాజనర్సింహా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జనాబాయి, శ్రీనివాస్‌రెడ్డి, మాదారం గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇటువైపు రాకోయ్ ‘అతిథి’!

- అలంకారప్రాయంగా అతిథి గృహం
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ఎనిమిదేళ్లు గడుస్తున్నా వినియోగానికి నోచుకోని భవనం
- ధ్వంసమైన తలుపులు, కిటికీలు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఐబీ అతిథి గృహం

లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అతిథి గృహం అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అలసత్వంతో నిరుపయోగంగా మారింది. భవనం నిర్మించి ఎనిమిదేళ్లు గడుస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. దీంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని స్థానిక నాయకులు, ప్రజలు వాపోతున్నారు.

– హత్నూర(సంగారెడ్డి)

మండల కేంద్రంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటి పారుదల శాఖ అతిథి గృహం నిర్మాణం కోసం రూ.27 లక్షలతో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి నిధులు మంజూరు చేయించారు. 2014 ఫిబ్రవరి13న అతిథి గృహం భవనానికి మంత్రి సునీతారెడ్డి చేతుల మీదుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా భవనాన్ని ప్రారంభించారు.

#### నిర్లక్ష్యం వీడాలి



లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన అతిథి గృహం నేటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. లక్షాలాది ప్రజాధనంతో ఆర్భాటంగా నిర్మించిన భవనం వినియోగానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా మారడం విచారకరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అతిథి గృహంలో సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

– నవీన్‌గౌడ్, మధుర గ్రామం

#### వినియోగంలోకి తేవాలి



లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అతిథి గృహం మందుబాబులకు అడ్డాగా మారింది. అతిథి గృహంలో ఫర్నిచర్ ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి వినియోగంలోకి తీసుకురావాలి. వృథాగా మారిపోయింది.

– ప్రశాంత్‌చారి, హత్నూర గ్రామం

#### వారం రోజులకే తాళం

భవన నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించినప్పటికీ ఫర్నిచర్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రారంభించిన వారం రోజులకే తాళం పడింది. అతిథిగృహం నిరుపయోగంగా మారడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఏళ్లు గడుస్తున్నా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో భవనం తలుపులు కిటికీలు తుప్పుపట్టిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# మల్బరీ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని మల్‌చెల్మ గ్రామంలో సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం పట్టు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ సిల్క్ బోర్డు(సీఎస్‌బీ) శాస్త్రవేత్త వినోద్‌కుమార్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ ప్రాంతంలో మల్బరీ సాగుకు అనుకూల వాతావరణం ఉందన్నారు. నల్ల రేగడి, చౌడు భూములు మినహా అన్ని రకాల భూముల్లో మల్బరీ పంటను సాగు చేయవచ్చని తెలిపారు. తక్కువ నీటి వినియోగం ఉంటుందని, ఒకసారి నాటితే 15 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. మళ్లీ మళ్లీ నాటాల్సిన పనిలేదని తెలిపారు. మొదటి ఏడాది 3పంటలు, రెండో సంవత్సరం 6–7 పంటలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా క్రిమి సంహారక మందుల వినియోగం కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మల్బరీ సాగుకు సిల్క్ సమగ్ర పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు రాయితీలను కల్పిస్తోందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు, జనరల్ రైతులకు వేరు వేరుగా రాయితీలను ఇస్తోందని చెప్పారు. రైతులు ముందుకు వచ్చి మల్బరీ పంటను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ సైంటిస్టులు డాక్టర్ రాఘవేంద్ర, మునిరత్నంరెడ్డి, పట్టు పరిశ్రమల అధికారులు విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగిశెట్టి, రైతులు పాల్గొన్నారు.

### కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు

జహీరాబాద్: ఎమ్మెల్యే మాణిక్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. నాయకులు గుండప్ప, విజయ్‌కుమార్, అల్లాడి నర్సింహులు, తంజీం, తట్టు నారాయణ, వెంకటేశం, యాకూబ్, ప్రభు, మచ్చేందర్, బండి మోహన్, మాజీ సర్పంచ్‌లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్: పట్టణ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణ పరిధిలోని పస్తాపూర్‌లోని ఉత్తమ్ కాలనీ, జర్నలిస్టు కాలనీ, ఆర్టీసీ కాలనీలో మంగళవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ కాలువలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయా కాలనీల ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో తిప్పలు తప్పడం లేదని వాపోయారు. దీంతో కమిషన్ స్పందిస్తూ సమస్యలు పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అనంతరం ఆయా కాలనీలకు చెందిన ముఖ్యులు రాజుపాటిల్, శ్యామ్, మహిపాల్, గోపాల్, నారాయణ, సంగమేశ్వర్, దేవపుత్ర, నర్సింహులు, శ్యాంసుందర్, రాములు, దశరథ్, శ్రీనివాస్ కమిషనర్‌తో సమావేశమై ప్రధాన సమస్యలను వివరించారు.

### పనుల్లో వేగం పెంచాలి

మునిపల్లి(అందోల్): అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మండల ప్రత్యేకాధికారి రామాచారి ఆయా శాఖల అధికారులకు, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సూచించారు. మంగళవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఆయా శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ హరినంధన్‌రావు, ఎంపీఓ నాగలక్ష్మి, సూపరింటెండెంట్ రామలింగం, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, ప్రత్యేకాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి: బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం బాల బ్రహ్మచారి సంత్ తపస్వి రామ్‌రావ్ మహారాజ్ జయంతి సందర్భంగా మంగళవారం వాల్‌పోస్టర్ విడదల చేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 21న ప్రతి గిరిజన తండాల్లో భవాని సేవాలాల్ ఆలయల వద్ద జయంతిని నిర్వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ, బంజారా బేరి వ్యవస్థాపక అధ్యక్షులు రాములునాయక్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్, లక్‌పతినాయక్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ధర్మనాయక్, ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

### పరామర్శ

నారాయణఖేడ్: పుణెలో వారం కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖేడ్ ప్రాంతానికి చెందిన అయిదుగురు మృతిచెందగా అందులో ఒకరైన ఖేడ్ పట్టణానికి చెందిన రఫీక్ ఖురేషి కుటుంబ సభ్యులను పలువురు నాయకులు మంగళవారం పరామర్శించారు. ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ జిల్లా మాజీ సభ్యులు రవీందర్ నాయక్, రాష్ట్ర ఆత్మ కమిటీ సభ్యులు కమలాపూర్ మారుతి, నాగల్‌గిద్ద మండల పరిషత్తు మాజీ ఉపాధ్యక్షులు పండరియాదవ్, గోవింద్ యాదవ్, బాసిత్ మృతుడి కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.



సన్మానం పొందిన మాజీ ప్రజాప్రతినిధులు

### ప్రజాసేవతోనే గుర్తింపు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజాసేవతోనే గుర్తింపు లభిస్తుందని జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని శివానగర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సంతోష దంపతులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందిని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ పదవీకాలం ముగిసినా ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడపొద్దు



ఝరాసంగం(జహీరాబాద్): మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఝరాసంగంలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారికి జరిమానాలు విధించారు. తనిఖీలలో ఏఎస్‌ఐ మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



రాయికోడ్: ఆర్ఐ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



జహీరాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సంగారెడ్డి: రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆ పార్టీ నాయకులు జిన్నారంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌రెడ్డి మాట్లాడుతూ ఆచరణలో అమలుకాని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీల అమలు ఊసే మర్చిపోయిందని ధ్వజమెత్తారు. ప్రజలకు పక్షాన ఉంటూ హామీల అమలుపై పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, ఆనంద్‌కృష్ణారెడ్డి, సుధాకర్, రమేశ్ పాల్గొన్నారు.

#### వినతి పత్రం అందజేత

రాయికోడ్(అందోల్): ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తుకారం డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి సహాయం లేక, బ్యాంకు నుంచి రుణాలు మంజూరు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా నాయకులు మాణిక్యం, గణేష్ ఉన్నారు.

#### బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో...

జహీరాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు ఇస్తామని చెప్పిన విధంగా రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ విషయంలో ఎలాంటి మెలికలు పెట్టొద్దన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, కార్యదర్శి చల్లా ప్రభాకర్‌రెడ్డి, నాయకులు సుధీర్‌భండారి, విశ్వనాథ్‌స్వామి, దుర్గయ్య, జగన్నాథం, మల్లేశం పాల్గొన్నారు.

#### బీజేపీ పట్టణ అధ్యక్షుడు ద్వారకా రవి ఆధ్వర్యంలో...

సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ద్వారకా రవి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా రుణమాఫీ చేయకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులు శివ, అజయ్, పట్టణ కార్యదర్శి పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షుడు లింగమూర్తి ,శరత్, సతీష్, రాము, దుర్గయ్య పోలీస్ శేఖర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ పనుల్లో నాణ్యత పాటించాలి**

పటాన్‌చెరు టౌన్: శ్మశానవాటికల ప్రహరీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని బండ్లగూడ కాలనీ సమీపంలో ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశానవాటిక మరమ్మతుల పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజూరైన కోటి 30 లక్షలతో స్మశాన వాటికలకు ప్రహరీలతో పాటు బోరుమోటారు వేయనున్నట్లు తెలిపారు.

**◆ విద్యార్థులకు గొడుగులు అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు గొడుగులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం విజయ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**◆ ఓడీఎఫ్‌లో రక్తదాన శిబిరం**

కంది(సంగారెడ్డి): రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని ఓడీఎఫ్ సీజీఎం శివశంకర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం (ఓడీఎఫ్లో ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, సతీష్ కుమార్, మోహన్, రమ్య పాల్గొన్నారు.

**◆ రోడ్డును సర్వే చేయాలని వినతి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్‌కు వెళ్లే రోడ్డును సర్వే చేసి మున్సిపల్ రికార్డు పరంగా రోడ్డును గుర్తించాలని కోరుతూ తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ విశ్వేశ్వర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ మాట్లాడుతూ మైఫెయిర్ మీదగా ఉస్మాన్‌నగర్ వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా మారిందన్నారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**◆ వర్షాధార పంటల సాగుపై అవగాహన**

కల్హేర్(నారాయణఖేడ్): వర్షాధార పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కల్హేర్ శ్రీకాంత్ రైతులకు సూచించారు. మంగళవారం కల్హేర్ రైతువేదికలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న, పెసర, పత్తి, సోయా, తదితర పంటల సాగు విధానంపై అవగాహన కల్పించారు. కృష్ణాపూర్‌లో ఏఈఓ కృష్ణావేణి పామాయిల్ మొక్కల పెంపకం విధానాన్ని పరిశీలించారు. మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, ఏఈఓ సంతోష పాల్గొన్నారు.

**◆ హాస్టల్లోని సమస్యలు పరిష్కరించాలి**

పటాన్‌చెరు టౌన్: ఎస్సీ హాస్టల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పటాన్‌చెరు డివిజన్ కన్వీనర్ రవికిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉప తహసీల్దార్ కార్తీక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రవికిరణ్ మాట్లాడుతూ పటాన్‌చెరులోని ఎస్సీ హాస్టల్లో అనేక సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 3 నెలల కిందట బోర్ మోటారు రిపేరు అయినప్పటికీ ఇంతవరకూ బాగు చేయలేదన్నారు, హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో అపరిచిత వ్యక్తులు వస్తుండటం ఇబ్బందిగా ఉందన్నారు. అంతేకాకుండా పందులు, కుక్కలు, పాములు విషసర్పాలు వస్తున్నాయని వాపోయారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 2 నెలలు గడుస్తున్నా నేటికీ దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అధికారులు వెంటనే స్పందించి హాస్టల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు తుకారం, అర్జున్, భాస్కర్, అజయ్ పాల్గొన్నారు.

**◆ సీడీసీ చైర్మన్‌గా శాదుల్లా**

కంగ్టి(నారాయణఖేడ్): కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగిలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సీడీసీ చైర్మన్‌గా కంగ్టి మండలం జమ్గి(బీ) గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ శాదుల్లా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శాదుల్లా మాట్లాడుతూ తన నియామకం కోసం సహకరించిన ఐటీ శాఖ మాత్యులు శ్రీధర్‌బాబు, ఎంపీ సురేష్‌షెట్కార్, ఖేడ్, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

**◆ పాఠశాలల ఆకస్మిక తనిఖీ**

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దెగుల్‌వాడి, తడ్కల్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాధికారి శంకర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు ఉపాధ్యాయులు సకాలంలో రావాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు సంగ్‌శెట్టి, సిబ్బంది ఉన్నారు.

**◆ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

సంగారెడ్డి టౌన్: పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ ఆ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విఠల్, కన్వీనర్ ఆకాష్, విద్యార్థులు పాల్గొన్నారు

**నారాయణఖేడ్‌లో...**

నారాయణఖేడ్: ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఏబీవీపీ నాయకులు అనిల్ జెండాను ఆవిష్కరించారు. సతీష్ యాదవ్, సతీష్, పవన్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, ప్రశాంత్, ఓంప్రకాష్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

**జహీరాబాద్ పట్టణంలో...**

జహీరాబాద్ టౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ జిల్లా నాయకుడు ప్రవీణ్ జెండాను ఆవిష్కరించారు. నాయకులు మహిపాల్, ఆనంద్, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**◆ తెలంగాణ మోడల్ స్కూల్‌లో రోబోటిక్స్ ప్రోగ్రాం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలోని ప్రభుత్వ తెలంగాణ మోడల్ పాఠశాలలో మంగళవారం రోబోటిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోహమ్ అకాడమిక్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో 135 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 20మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి ఈ సంస్థ రోబోటిక్స్ కార్యక్రమంపై ఏడాది పాటు శిక్షణ ఇస్తుంది. అకాడమీ సహదేవ్, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ పాల్గొన్నారు.

**◆ కేతకీలో పార్కింగ్ కోసం బహిరంగ వేలం**

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో నేడు వాహనాల పార్కింగ్ కోసం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఆలయ ఈఓ శశిధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఆలయ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.50 వేలు జమ చేయాలన్నారు. టెండరు దక్కని వారికి డబ్బులు తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు.